ప్రజాశక్తి

శనివారం 25 నవంబర్ 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఆర్నెళ్లుగా ఇవ్వని కందిపప్పు

◆ సరఫరాకు చర్యలు చేపట్టని ప్రభుత్వం ◆ బహిరంగ మార్కెట్లో కొనుక్కోలేని పేదలు





ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

బియ్యం కార్డులకు ఆర్నెళ్లుగా కందిపప్పును ప్రభుత్వం సరఫరా చేయడంలేదు. దీంతో అధిక ధర పెట్టి మార్కెట్లో కొనలేక పేదలు అత్యధిక మంది కందిపప్పు వంట మానేశారు. గతంలో రేషన్ షాపుల ద్వారా ప్రతి నెల రూ.67కు కిలో కందిపప్పును లబ్ధిదారులకు ప్రభుత్వం సరఫరా చేసేది. మార్కెట్లో దీని ధర కనీసంగా రూ.130 నుంచి రూ.200 వరకూ వుండడంతో పాత ధరకు సరఫరా చేయలేక గుత్తేదారులు చేతులెత్తేశారు. పెరిగిన ధరకు అనుగుణంగా టెండర్లు పిలిచి ధర నిర్ణయించి సరఫరాకు చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం ఆ పనిచేయలేదు. దీంతో పాత ధరకు కందిపప్పు సరఫరా నిలిచిపోయింది. పేదలకు ఈ ఏడాది జూన్ నుంచి నవంబరు వరకు అందలేదు. ఆగస్టు రేషన్‌తో కలిపి జూన్, జులై నెలల కందిపప్పు పంపిణీ చేస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రకటించి నెలలు గడుస్తున్నా నేటికీ కందిపప్పు ఇవ్వడంలేదు. జిల్లాలో 5.47 లక్షల బియ్యం కార్డులున్నాయి. ఈ కార్డుల ప్రకారం ప్రతి నెలా 540 మెట్రిక్ టన్నులు కేటాయించాల్సివుంది. ప్రభుత్వ నిర్దేశిత ధర రూ.67 ప్రకారం నెలకు రూ.3.66 కోట్ల విలువైన కందిపప్పు లబ్ధిదారులకు అందాల్సివుంది. ఆర్నెళ్లుగా సరఫరా చేయకపోవడంతో రూ.21.96 కోట్లు ఆదా అయిందన్న ఆలోచనతో వున్నట్లు కనబడుతోంది తప్ప పేదలకు ఇవ్వాల్సిన కందిపప్పు ఇవ్వలేదన్న చింత ఏ మూలా ప్రభుత్వంలో లేదు. అయితే డిసెంబరు నుంచి రేషన్‌తో పాటు కేజీ కందిపప్పు ప్రభుత్వం సరఫరా చేయనుందని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారులు చెబుతున్నారు. ఒకవేళ సరఫరాను పునరుద్ధరించినా లబ్ధిదారులందరికీ సరఫరా చేసేలా ప్రభుత్వ చర్యలు ఏ కోశానా కనబడ్డంలేదు.



గాయపడ్డ కార్మికున్ని పరామర్శిస్తున్న సిఐటియు నాయకులు గనిశెట్టి

బొగ్గు లారీని ఢీకొన్న ఫార్మా బస్సు

◆ ఒకరు మృతి ◆ పలువురికి గాయాలు

ప్రజాశక్తి - పరవాడ : పరవాడ, లంకెలపాలెం మెయిన్ రోడ్డులో రాంకీ ఫైర్ స్టేషన్ సమీపాన శుక్రవారం తెల్లవారుజాము 5.30 గంటల సమయంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పార్కింగ్ చేసిన బొగ్గులారీని ఓ ఫార్మా కంపెనీకి చెందిన కంఫర్ట్ ట్రావెల్ బస్సు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో అచ్యుతాపురం లారస్ కంపెనీకి ఉదయం ఆరు గంటల షిఫ్ట్ డ్యూటీకి వెళ్తున్న కార్మికుడు ఎస్.నాగ వెంకటేష్ (30) అక్కడికక్కడే మృతి చెందారు. షిఫ్ట్ ఇన్‌ఛార్జి గంగాధర్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. జి.వెంకటరావు, ఎం.చెన్నారావు, కె.గణపతి తదితరులూ మిగతా 2లో..



ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు

బిసిల బతుకులతో జగన్ చెలగాటం

▶ వార్త 2లో..

ఎయు ఇన్‌ఛార్జి విసిగా సమత

▶ వార్త 2లో..

బిఆర్‌టిఎస్ బాధితులకు న్యాయం చేస్తాం

▶ వార్త 2లో..



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న హీరో నాగార్జున, వేదికపై యార్లగడ్డ, అఖిల్, తదితరులు

ఎయులో ఆధునీకీకరించిన ఆరుబయలు రంగస్థలం ప్రారంభం

ముఖ్య అతిథిగా హీరో నాగార్జున హాజరు వార్త మెయిన్‌లో..

పిల్లల భద్రతలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

◆ పాఠశాలల్లో విధిగా ప్రమాణాలు పాటించాలి
◆ స్కూల్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ వర్క్ షాప్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున
◆ చిన్న ఫిర్యాదు వచ్చినా ఉపేక్షించేది లేదని హెచ్చరిక

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : బడి పిల్లల భద్రత విషయంలో జాగ్రత్తగా ఉండాలని, చిన్నపాటి నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున హెచ్చరించారు. అన్ని పాఠశాలల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని, సంబంధిత చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలోని ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన స్కూల్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ వర్క్ షాప్‌లో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన బడి పిల్లల ఆటో ప్రమాదం తనను తీవ్రంగా కలిచివేసిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృతం కాకూడదని కోరుకుంటున్నానన్నారు. బడికి వచ్చే పిల్లల ప్రయాణ సాధనాలపై ఆయా పాఠశాలల యాజమాన్యాలు తప్పకుండా అవగాహన కలిగి ఉండాలని, వారు ఇంటికి క్షేమంగా చేరుకునే వరకూ యాజమాన్యాలే బాధ్యత తీసుకోవాలని సూచించారు. పిల్లల భద్రత విషయంలో చిన్నపాటి నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించేది లేదని, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో మిగతా 2లో..



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున, డిఇఒ చంద్రకళ తదితరులు

మొదటి పేజీ తరువాయి..

పిల్లల భద్రతలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

చెప్పిన అన్ని విషయాలనూ పాఠశాల యాజమన్యాలు ఆచరించాలని, భవిష్యత్తులో తప్పులు జరిగితే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

జిల్లా ప్రాముఖ్యత దృష్ట్యా చర్యలు

రానున్న రోజుల్లో విశాఖపట్నం జిల్లాకు ప్రాముఖ్యత చాలా పెరగనుందని, విద్యా సంస్థల నిర్వహణలో, ప్రమాణాలు పాటించడంలో అందరూ జాగ్రత్తగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఆహ్లాదకరణమైన వాతావరణంలో పాఠశాలలను నిర్వహించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఎత్తైన భవనాల పిట్ట గోడలను పటిష్ఠం చేయాలని, కావాలంటే ఎత్తు పెంచాలని చెప్పారు. విద్యుత్ తీగలు, స్విచ్ బోర్డులు పిల్లలకు అందుబాటులో లేకుండా చూసుకోవాలన్నారు. బాలికలపై లైంగిక వేధింపులు లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఛైల్డ్ ఫ్రెండ్లీ విధానాలు పాటించాలని, తరచూ అవగాహన శిబిరాలు పెట్టాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో తప్పకుండా డెంగీ కిట్లను అందుబాటులో ఉంచాలని, పాత భవనాలు ఉంటే తక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. డిసిపి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, అందరూ భాగస్వామ్యం వహించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, ప్రతి ఒక్కరూ జీవితం విలువ తెలుసుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో డిఇఒ ఎల్.చంద్రకళ, ఉప రవాణా శాఖ కమిషనర్ రాజారత్నం, అగ్నిమాపక శాఖ అధికారి రేణుకయ్య, ఎడిసిపి జి.శ్రీనివాసరావు, ఐసిడిఎస్ ఉప సంచాలకులు వెంకటేశ్వరి, ఎసిపి డి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ డిఎఫ్ఒ సింహాచలం తదితరులు పాల్గొన్నారు. అనంతరం రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ రూపొందించిన పోస్టర్లను కలెక్టర్, డిటిసి, ఇతర అధికారులు ఆవిష్కరించారు.

బొగ్గు లారీని ఢీకొన్న ఫార్మా బస్సు

గాయపడ్డారు. వీరు విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పరామర్శించారు. ప్రమాద కారణాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని ట్రావెల్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. అతివేగంగా వాహనాలు నడపడం, ఒకే డ్రైవర్‌తో అనేక డ్యూటీలు చేయించడం, పని ఒత్తడి వంటి కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. బొగ్గు లారీలను ఈ మార్గంలో ఎక్కడబడితే అక్కడ రాంగ్ పార్కింగ్ చేస్తున్నారన్నారు. వీటిపై ఆర్‌టిఒ, పోలీస్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చనిపోయిన కార్మిక కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని, సరిగా స్పందించకుంటే ట్రావెల్ యాజమాన్యాలు భవిష్యత్తులో ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.



మాట్లాడుతున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వేదికపై కమిషనర్ సాయికాంత్ వర్మ

బిఆర్‌టిఎస్ బాధితులకు న్యాయం చేస్తాం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి పరిధిలోగల సింహాచలం తొలి పావంచా నుంచి అడివివరం జంక్షన్ వరకు బిఆర్‌టిఎస్ రోడ్డు విస్తరణలో ఆస్తులు, భవనాలు కోల్పోయిన నిర్వాసితులందరికీ నష్టపరిహారం అందించి న్యాయం చేస్తామని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన భీమిలి నియోజకవర్గ శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన జివిఎంసి టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులు. బిఆర్‌టిఎస్ రోడ్డు విస్తరణ భాదితులతో కలిసి వాసుదేవ కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ బాధితులు ఆందోళన చెందవద్దన్నారు. పూర్తిగా ఇల్లు కోల్పోయిన సుమారు 70 మందికి ఒక సెంట్ స్థలం చొప్పున ఇచ్చే ఏర్పాట్లు చేస్తామని, ఖాళీ స్థలాలకు టిడిఆర్‌లు ఇప్పిస్తామని తెలిపారు. అనంతరం పలువురు బాధితులు మాట్లాడుతూ గోశాల నుండి అడవివరం వరకు రెండు వైపులా ఒకే మార్కెట్ విలువను నిర్ణయించాలని, కొంతమందికి పూర్తిగా వ్యాపారానికి సంబంధించిన ఆస్తులు పోయాయని, వారికి ఉపాధి మార్గాలను చూపాలని కోరారు. నష్ట పరిహార చెక్కులు అందరికీ వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో 98వ వార్డు కార్పొరేటర్ పిసిని వరహాలక్ష్మీ నరసింహం, చీఫ్ సిటీ ప్లానర్ సురేష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సుధాకర్, రమణ మూర్తి పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ తగదు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రతిపాదనను బేషరతుగా విరమించాలని పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి కోరారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు శుక్రవారానికి 965వ రోజుకు చేరాయి. దీక్షల్లో పిఒడబ్ల్యు నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ నిర్వాసితులందరికీ పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

బిసిల బతుకులతో చెలగాటం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : బిసిల బతుకులతో చెలగాటం ఆడుతున్న జగన్ మోహన్ రెడ్డిని రాష్ట్రం నుంచి తరిమేసేలా కలిసి పనిచేస్తామని పలువురు బిసి నేతలు అన్నారు. శుక్రవారం సాయంత్రం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో 'బిసిలకు ప్రభుత్వ నమ్మక ద్రోహంపై ఐక్య పోరాటం' అన్న అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు అధ్యక్షతన విశాఖ జిల్లా బిసి సెల్ అధ్యక్షులు తమ్మిన విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి అనసూరి మధుసూదనరావు ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు.

ముఖ్య అతిథిగా టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ఎన్నికల ముందు జనగణన పేరుతో బిసిలను వంచించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి చట్టబద్ధతా లేకుండా వాలంటీర్లతో జనగణన చేయడం నమ్మక ద్రోహం కాక మరేంటని ప్రశ్నించారు. విశాఖను రాజధానిగా చెబుతూ ఉత్తరాంధ్ర ప్రజలను



అభివాదం చేస్తున్న యనమల, పలువురు బిసి నేతలు

మోసం చేస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ బిసిలకు చెందిన 75 వేల కోట్లును దారి మళ్లించి, రిజర్వేషన్‌ను కుదించి బిసిలను దగా చేయడమే జగన్ చెప్పే బిసి సంక్షేమమా ? అన్ని ప్రశ్నించారు. కార్యక్రమంలో బిసి సాధికార సమితి ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీసెట్టి బాబ్జీ, బిసి సంఘాల నాయకులు అంగటి రాంబాబు, అప్పలరాజు, వెంకట్, రామచంద్రరావు, తాతారావు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్, ఎఎన్‌ఆర్‌ల ఆప్తుడు యార్లగడ్డ

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : ఎన్‌టిఆర్, ఎఎన్‌ఆర్‌లకు అత్యంత ఆప్తులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ అని సినీ హీరో నాగార్జున అన్నారు. సిరిపురం వాల్తేరు క్లబ్బులో సప్తతి ఒక లిప్తగా పేరిట పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ 70 వసంతాల వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. విద్య, సినిమా, సాహిత్య, రాజకీయ రంగ ప్రముఖులు సమక్షంలో ఈ వేడుకలు నిర్వహించారు. అతిథిగా హాజరైన హీరో నాగార్జున మాట్లాడుతూ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ స్నేహ శీలి అని కొనియాడారు. ఆయన్ను తనకు తన తండ్రి పరిచయం చేశారన్నారు. సలహాలు అవసరమైనప్పుడు తాను యార్లగడ్డకు ఫోన్ చేస్తుంటానన్నారు. మిజోరాం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ యార్లగడ్డ అందరివాడు అని కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా లోక్ నాయక్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ నల్లా బాబయ్యకు హీరో నాగార్జున చేతుల మీదుగా రూ.50 లక్షల విరాళం అందించారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, సినీ



యార్లగడ్డతో ఉండవల్లి అరుణ్‌కుమార్ తదితరులు

దర్శకుడు కె.రాఘవేంద్ర రావు, హీరో అఖిల్, నటుడు తనికెళ్ల భరణి, నటి రోజా రమణి, రాష్ట్ర ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీలు వి.విజయసాయిరెడ్డి, కె.రామ్మోహన నాయుడు, మాజీ ఎంపీలు కెవిపి.రామచంద్రరావు, ఉండవల్లి అరుణ్ కుమార్, మాజీ మంత్రులు గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, దాడి వీరభద్రరావు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, ఎయు వైస్ ఛాన్సలర్ ఆచార్య పివిజిడి.ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

ఎయు ఇన్‌ఛార్జి విసిగా సమత

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆంధ్ర విశ్వ కళా పరిషత్ వైస్ ఛాన్సలర్ ఆచార్య పివిజిడి. ప్రసాదరెడ్డి పదవీ కాలం శుక్రవారంతో ముగియడంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఆదేశాల మేరకు వర్సిటీ ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్‌గా ప్రస్తుత రెక్టార్ ఆచార్య కె.సమతను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి జె.శ్యామలరావు శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు.



పార్కును పరిశీలిస్తున్న మేయర్ హరివెంకట కుమారి

గోకుల్ పార్కు పరిసరాలను శుభ్రపరచండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాధాకృష్ణ మహోత్సవం సందర్భంగా బీచ్ రోడ్డులోని గోకుల్ పార్కును శుభ్రపరచాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె పార్కులోని కృష్ణ మందిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 26 ఆదివారం రాధాకృష్ణ మహోత్సవం జరుగనుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నందున తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా విద్యుత్ అలంకరణ, పారిశుధ్యం, మొబైల్ టాయిలెట్స్, తాగునీరు మొదలైన మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. మొక్కలు నాటి ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ దామోదరరావును ఆదేశించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఎఎమ్ఒహెచ్ రాజేష్, కార్యనిర్వాహక ఇంజినీర్లు శేఖర్, దిలీప్ పాల్గొన్నారు.

సమస్యలపై ఐక్యంగా పోరాడాలి

ఐద్వా జిల్లా అధ్యక్షులు పద్మ

ప్రజాశక్తి -తగరపువలస : సమస్యలపై ఐక్యంగా పోరాడాలని ఐద్వా జిల్లా అధ్యక్షులు బి.పద్మ మహిళలకు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్ర వారం ఐద్వా భీమిలి జోన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాజకీయ లబ్ధి కోసమే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహిళా బిల్లును ముందుకు తీసుకొచ్చింది తప్పితే మహిళల పట్ల కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్త శుద్ధి లేదన్నారు. మహిళపై వివిధ రూపాల్లో దాడులు పెరుగుతున్నాయని, వీటిని అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని అన్నారు

భీమిలి జోన్ నూతన కమిటీ ఎన్నిక

ఐద్వా భీమిలి జోన్ నూతన కమిటీని శుక్రవారం సిఐటియు కార్యాలయంలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎస్.గున్నమ్మ, ప్రధాన కార్యదర్శిగా కె.నాగరాణి, సభ్యులుగా జి.లక్ష్మి, పి.రమణమ్మ, సిహెచ్.లావణ్య, యు.సూకరత్నం, ఎన్.వెంకయ్యమ్మ, ఎస్.చిన్ని, మాధవి ఎన్నికయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా అధ్యక్షులు పద్మ

నేరాలు ఘోరాలు

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు పరిధి తిమ్మాపురం విజ్ఞాన వరల్డ్ వన్ కళాశాల హాస్టల్‌లో ఉంటున్న ఎంపిసి ఇంటర్ ద్వితీయ ఏడాది విద్యార్థి ఈ నెల 23న రాత్రి సుమారు 8 గంటల సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా చిలకపాలెం ప్రాంతానికి చెందిన గుడిశె కాశీ సాయిచరణ్ (17) తిమ్మాపురం విజ్ఞాన్ వరల్డ్ వన్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. 8వ తరగతి నుంచి ఇదే విద్యా సంస్థలో చదువుతున్నాడు. ఈ నెల 23వ తేదీ రాత్రి గుడిశె కాశీ సాయిచరణ్ గదికి సహచర విద్యార్థులు వెళ్లగా తలుపులు వేసి ఉన్నాయి. కళాశాల సిబ్బంది, తోటి విద్యార్థులు తలుపులు బద్దలు కొట్టి గదిలోకి వెళ్లారు. అతను ఉంటున్న గదిలోనే ఫ్యాన్‌కు బెడ్ షీట్‌తో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కళాశాల యాజమాన్యం, తోటి విద్యార్థులు కలిసి గీతం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఎస్ఐ తాతారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ స్టవ్ మంటలతో తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధి వాంబేకాలనీలో శుక్రవారం గ్యాస్ స్టవ్ నుంచి మంటలు చెలరేగడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. 27 బిఎఫ్ఎఫ్ -2లో వేముల బాలరాజు తన భార్య చిన్ని, కుమారులు కార్తీక్, గిరితో కలిసి నివాసముంటున్నారు. కుటుంబ సభ్యులు నలుగురూ భవానీ మాల ధరించారు. ఎప్పటిలాగే శుక్రవారం పూజలు నిర్వహించారు. ఇంట్లో గ్యాస్ సిలిండర్ అయిపోవడంతో దాన్ని మార్చే సందర్భంలో గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో కుటుంబ సభ్యులు నలుగురు మంటల్లో చిక్కుకొని తీవ్ర గాయాలపాలయ్యారు. వారిని స్థానికులు కెజిహెచ్‌కు తరలించారు. సమాచారం తెలుసుకున్న పిఎం.పాలెం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బాధితులకు పరామర్శ

ఈ ప్రమాదంలో గాయపడిన బాధితులను భీమిలి నియోజకవర్గం జనసేన, తెలుగుదేశం పార్టీల ఇన్‌ఛార్జుల పంచకర్ల సందీప్, కోరాడ రాజబాబు శుక్రవారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో చంద్రరావు, పిళ్లా వెంకటరావు, నాగోతి నరసింహ నాయుడు, వి.చిన్న, సాయి, కామేష్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



దగ్ధమైన ఇల్లు, షాపులు

ఇల్లు, రెండు షాపులు దగ్ధం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం పెద్దిపాలెంలో శుక్రవారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించి కమ్మల ఇల్లుతో పాటు రెండు షాపులు పూర్తిగా దగ్ధమయ్యాయి. పెద్దిపాలెం జాతీయ రహదారి వంతెన పక్కన తాడిపూడి గోవిందరావు బార్బర్ షాప్ నిర్వహిస్తున్నాడు. శుక్రవారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో షాపులో మంటలు చెలరేగాయి. దీంతో రెండు షాపులతో పాటు పక్కనే ఉన్న కమ్మల ఇల్లు పూర్తిగా కాలిపోయాయి. ఇంట్లో ఉన్న బట్టలు, బ్యాండ్ సామాన్లతో పాటు రూ.30 వేలు నగదు కాలిపోయిందని బాధితులు రోదిస్తున్నారు.

రెవెన్యూ అధికారుల పరిశీలన

ప్రమాద విషయం తెలుసుకున్న తహశీల్దార్ లోకవరపు రామారావు, రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు తక్షణ సహాయంగా 25 కేజీలు బియ్యం, పప్పు, చింతపండు, నూనె అందజేశారు. పెద్దపాలెం గ్రామానికి చెందిన స్వచ్ఛంద సేవకుడు కూరాకుల వెంకటేష్ బాధిత కుటుంబాలకు 4 చీరలు, 4 పంచెలు, 2 తవ్వాళ్లు, రూ.2000 నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో మరుపల్లి చిన్నయ్య పాత్రుడు, కూరాకుల వెంకటేష్, గుండు ఎల్లారావు, గుండు మురళి, విఆర్ఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

27న పుష్కరిణిలో పుణ్యహారతి

ప్రజాశక్తి-సింహాచలం: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 27వ తేదీన పుష్కరిణిలో పుణ్యనది హారతి కార్యక్రమాన్ని జరిపేందుకు సింహాచలం దేవస్థానం అధికారులు ఏర్పాట్లుచేశారు. ఆ రోజు సాయంత్రం నాలుగున్నర గంటలకు కొండ దిగువన వెంకటేశ్వరస్వామి ఆలయ ఉత్సవమూర్తులను పల్లకిపై బయలుదేరి ఐదున్నర గంటలకు పుష్కరిణి వద్దకు చేరుకొని నక్షత్ర హారతి, కొబ్బరి హారతిని సమర్పిస్తారు. ఈ కార్యక్రమం పాల్గొని దీపాలు వెలిగించాలని దేవస్థానం అధికారులు కోరారు. ఈ ఉత్సవం సందర్భంగా ఆ రోజు సాయంత్రం ఏడు గంటల తర్వాత భక్తులకు దర్శనాలు లభించవని అధికారులు తెలిపారు.

అప్పన్నను దర్శించుకున్న ముత్తంశెట్టి

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. ఆయన ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. ముత్తంశెట్టికి ఈవో సత్కరించి స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందించారు. అనంతరం ఈవోతో ఎమ్మెల్యే మాట్లాడుతూ అనంత పద్మనాభస్వామి ఆలయంలో దీపోత్సవానికి సింహాచలం దేవస్థానం నుంచి రూ.8 లక్షలు కేటాయించాలని కోరారు.

అప్పన్న ఆలయంలో చిలక ద్వాదశి పూజలు

ప్రజాశక్తి-సింహాచలం: అప్పన్న ఆలయంలో చిలక ద్వాదశిని పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో దేవస్థానం ఈవో సింగాల శ్రీనివాస్‌మూర్తి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేత నరసింగరావు మృతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు చేపలుప్పాడకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిహెచ్.నరసింగరావు శుక్రవారం ఉదయం మృతిచెందినట్లు పిసిసి సభ్యులు టి.రామదాసు తెలిపారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్నారని వివరించారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఎంతగానో కృషిచేశారని తెలిపారు. ఆయన మృతి పట్ల సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బయోమెడికల్ డివైజ్ వెబ్‌సైట్ ఆవిష్కరణ



వెబ్‌సైట్ ఆవిష్కరణలో పాల్గొన్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) సంయుక్త నిర్వహణలో బయోమెడికల్ డివైజ్ హ్యాక్‌థాన్ (బయోమెడ్ భారత్-2024) నిర్వహిస్తున్నట్లు గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం తెలిపారు. దీనికి సంబంధించిన ప్రత్యేక వెబ్‌సైట్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యరంగం అవసరాలను గుర్తించి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశీయంగా అభివృద్ధి చేయడానికి యువతను ప్రోత్సహించే ఉద్దేశంతో జాతీయ స్థాయిలో ఈ హ్యాక్‌థాన్‌ను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. దేశంలోని గుర్తింపు పొందిన విద్యా సంస్థలలో ప్రస్తుతం పూర్తి కాలపు అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు అభ్యసిస్తున్న వారు, పరిశోధక విద్యార్థులు (పి.హెచ్‌డి విద్యార్థులు) ఈ హ్యాక్‌థాన్ పోటీలలో పాల్గొనడానికి అర్హులని తెలిపారు. పోటీలలో పాల్గొనడానికి ఆసక్తి గల విద్యార్థి బృందాలు ఈ ఏడాది డిసెంబర్ 15వ తేదీలోగా బయోమెడ్ భారత్-2024 వెబ్‌సైట్ ద్వారా వివరాలను నమోదు చేసుకోవాలని, డిసెంబర్ 22వ తేదీన అర్హత సాధించిన జట్లను ప్రకటిస్తామని చెప్పారు. డిసెంబర్ 29వ తేదీన నిపుణుల పర్యవేక్షణలో బూట్ క్యాంప్ నిర్వహిస్తామని, 2024 జనవరి 26వ తేదీన జట్ల నుంచి తుది ఆలోచనలపై నివేదిక స్వీకరిస్తామని పేర్కొన్నారు. మార్చి నెల 1, 2 తేదీలలో వర్క్‌షాప్ నిర్వహించి ఫైనల్స్ విజేతలను ప్రకటిస్తామన్నారు. ఫైనల్ విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.లక్ష నగదు, తరువాతి స్థానాలలో నిలచిన వారికి రూ.50వేలు చొప్పున అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో గీతం ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, జిమ్సర్ డీన్ డాక్టర్ ఎస్‌పి.రావు, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్‌లు ప్రొఫెసర్ సి.విజయశేఖర్, డైరక్టర్ ప్రొఫెసర్ నాగేంద్రప్రసాద్, సీనియర్ ప్రొఫెసర్ బి.రవికిషోర్, ఎమ్.బాలాకుమార్ తదితరులు పాల్గొన్నారు. పూర్తి సమాచారంకోసం http://biomedbharat.gitam.edu. సందర్శించాలని సూచించారు.

ఆర్ఎస్ఎన్.మూర్తికి మాతృవియోగం



రెడ్డి దేవుడమ్మ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి -భీమునిపట్నం : సిపిఎం భీమిలి జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్ ఎన్ . మూర్తికి మాతృవియోగం కలిగింది. మూర్తి తల్లి రెడ్డి దేవుడమ్మ (70) గురువారం రాత్రి 10.30 గంటలకు ఇంటి వద్దనే కన్ను మూశారని కుటుంబ సభ్యులు తెలిపారు. సొంతూరు విజయనగరం జిల్లా వేపాడ మండలం నల్లబిల్లి గ్రామం. ఈమె గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఈమెకు నలుగురు కుమారులు. పెద్ద కుమారుడు మూర్తి ప్రస్తుతం సిపిఎం భీమిలి జోన్ ప్రధాన కార్యదర్శిగా భాధ్యతలు నిర్వహిస్తున్నారు.

సిపిఎం విశాఖ జిల్లా కమిటీ సంతాపం

ఆర్ఎస్ఎన్.మూర్తి తల్లి రెడ్డి దేవుడమ్మ మృతి పట్ల సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ప్రగాఢ సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

సేంద్రియ వరి దిగుబడి పరిశీలన

ప్రజాశక్తి పద్మనాభం : పద్మనాభం కొవ్వాడ గ్రామంలో సేంద్రియ పద్ధతిలో పండించిన వరి పంట దిగుబడిని వ్యవసాయ శాఖాధికారులు శుక్రవారం పరిశీలించారు. వ్యవసాయ క్షేత్రంలోకి రీజనల్ అధికారులు ప్రకాష్, హేమసుందర్, డిపిఎం మోహనరావు వెళ్లారు. క్షేత్రంలో 5×5 భాగంలో వరిని కోసి, గింజలు రాల్చి పంట దిగుబడిని లెక్కకట్టారు. అనంతరం వర్షాధారంలో రబీ ఎలా వేసుకోవాలని, వర్షాధారం కాని భూముల్లో ఏ పంటలు వేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



వరి పంట దిగుబడిని పరిశీలిస్తున్న అధికారులు



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న చందక లక్ష్మి కుటుంబీకులు

పుట్టిన రోజున సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి -ఆనందపురం : మనవరాలు విద్యశ్రీ పుట్టినరోజు సందర్భంగా ఆనందపురం సర్పంచ్ చందక లక్ష్మి పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆనందపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. గ్రామంలో ఉన్న తపాలా కార్యాలయం, గ్రంథాలయాలకు ఫ్యాన్లు, లైట్లు అందజేశారు. పొడుగుపాలెం గ్రామంలో అయ్యప్ప స్వాముల దీక్ష పీఠానికి మంచినీరు బోరు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు కుమారుడు చందక బాబి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పట్నాయక్ మాస్టర్, భాస్కరరావు, రాజు, పిఇటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ

ప్రజాశక్తి- ములగాడ : జివిఎంసి 61వ వార్డు టిడిపి అధ్యక్షులు మజ్జి సోమేష్ తన కుమారుడు మజ్జి కుశల్ జ్ఞాపకార్థం శుక్రవారం జైకృష్ణ కోలాటం మహిళలకు, చిన్నారులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సోమేష్ మాట్లాడుతూ, చిన్న వయసులోనే చిన్నారులు కోలాటం నేర్చుకోవడం ఆనందించదగ్గ విషయమన్నారు. వీరికి తన వంతు సహాయం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి సత్యనారాయణ, ఊరుకుటి పైడిరాజు, మహిళలు పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న మజ్జి సోమేష్


ఎడ్యుస్కిల్ కనెక్ట్‌లో 'ఎంవిఆర్' ప్రతిభ

ప్రజాశక్తి -గాజువాక : ఎఐసిటిఇ ఎడ్యుస్కిల్ ఆధ్వర్యాన ఇటీవల గోవాలో నిర్వహించిన స్కిల్ కనెక్ట్ -23 నెక్స్‌కాన్ కేవ్‌లో గాజువాక ఎంవిఆర్ డిగ్రీ కళాశాల ఆరు బహుమతులను సాధించిందని కరస్పాండెంట్ రామారావు తెలిపారు. ఈ మేరకు బహుమతులను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమోద్ ద్వారా తాను, కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.సందీప్ అందుకున్నామని వివరించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి రెండు కళాశాలలకు మాత్రమే బహుమతులు వచ్చాయని, అందులో ఎంవిఆర్ కళాశాల ఒకటి అని పేర్కొన్నారు. ఎంవిఆర్ కళాశాలను ఆంధ్ర యూనివర్సిటీ వీసీ ప్రసాద్‌రెడ్డి అభినందించారు.



ఎయు వీసీ ప్రసాదరెడ్డిని కలిసిన ఎంవిఆర్ యాజమాన్య ప్రతినిధులు

బెస్ట్ పెర్ఫార్మింగ్ కళాశాలగా 'అవంతి'



జాతీయ స్థాయి అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపల్ మురళీకృష్ణ

ప్రజాశక్తి- తగరపువలస : జాతీయ స్థాయిలో 5వ బెస్ట్ పెర్ఫార్మింగ్ కళాశాలగా స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాల నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ బి.మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. ఎపి స్టేట్ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్, స్మార్ట్ ఇంటర్న్‌షిప్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన లాంగ్ టర్మ్ వర్చువల్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌ను కాకినాడ జవహర్ లాల్ నెహ్రూ టెక్నోలాజికల్ యూనివర్సిటీలో నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అవంతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో జాతీయ స్థాయి అవార్డును కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణకు అందజేశారు. ఇందుకు గాను యాజమాన్యం, డైరెక్టర్ డాక్టర్ కె చంద్రశేఖర్ హర్షం వెలిబుచ్చారు. ఇందుకు కృషి చేసిన కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన కో-ఆర్డినేటర్ ఎన్.సళితశ్రీని, సహచర అధ్యాపకులు ప్రశంసించారు.

'కులగణనలో తూర్పుకాపుగా నమోదుచేయాలి'

ప్రజాశక్తి-పెందుర్తి : ప్రభుత్వం చేపట్టే కుల గణన సర్వేలో తూర్పు కాపు అని నమోదుచేయాలని విశాఖ జిల్లా తూర్పు కాపు సంఘం అధ్యక్షులు ఎవి.రమణయ్య కోరారు. జివిఎంసి 95వ వార్డు పరిధి చీమలాపల్లి సమీపంలోని శ్రీకృష్ణదేవరాయ కాపు కళ్యాణ మండపంలో శుక్రవారం కాపు సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎవి.రమణయ్య మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎవరు నిలబడినా మన సంఘానికి చెందిన మంచి అభ్యర్థిని గెలిపించడానికి ఐక్యంగా కృషి చేద్దామన్నారు. సంఘంలోని సమస్యలను కూడా ఐక్యంగానే పరిష్కరించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎమ్.సన్యాసిరావు, ముమ్మన దేముడు, సేనాపతి శేఖర్, బొడ్డేటి ప్రకాష్, మధుపాడ అంజి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కాపు సంఘం నాయకులు

నర్సింగ్ విద్యార్థినుల ర్యాలీ

ప్రజాశక్తి-సీతమ్మధార: ప్రపంచ యాంటీ మైక్రోబయల్ వారోత్సవాల సందర్భంగా నర్సింగ్ విద్యార్థినులు, డిఎం అండ్ హెచ్ఒ కార్యాలయ సిబ్బంది శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ సత్యం జంక్షన్ మీదుగా మళ్లీ డిఎం అండ్ హెచ్ఒ కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ, డాక్టర్ చీటీ లేనిదే ఎవరూ యాంటీ బయోటిక్స్ మందులు వాడకూడదన్నారు. వీటిని ఎక్కువగా వాడటం వలన శరీరం రోగ నిరోధక శక్తిని కోల్పోతుందని వివరించారు. ఈ ర్యాలీలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ బి.ఉమావతి, జిల్లా నోడల్ అధికారి బి.నాగేశ్వరరావు, శశిభూషణం, డాక్టర్ జగదీశ్వరప్రసాద్, సయ్యద్ బేగం, రవిశంకర్, బి.నాగభూషణం పాల్గొన్నారు.



కాయల వెంకటరెడ్డిని సన్మానిస్తున్న కెకె.రాజు

కాయలకు కెకె.రాజు శుభాకాంక్షలు

ప్రజాశక్తి- సీతమ్మధార : ఏపీ మారీటైమ్ బోర్డు ఛైర్మన్‌గా మరోసారి నియమితులైన కాయల వెంకటరెడ్డిని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు శుక్రవారం సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, భవిష్యత్తులో కాయల వెంకటరెడ్డి మరిన్ని పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 14వ వార్డు కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

'వైసిపితో అన్ని తరగతులకూ లబ్ధి'

ప్రజాశక్తి-యంత్రాంగం

వైసిపి ప్రభుత్వంలో అన్ని తరగతులకు లబ్ధిచేకూరుతోందని వక్తలు పేర్కొన్నారు. జిల్లాలోని పలుచోట్ల శుక్రవారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..' కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ పథకాల గురించి ప్రచారం చేశారు.

గాజువాక : జివిఎంసి 65వ వార్డు పరిధి గిరిజాకాలనీలోని వికాస్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్ద ఎపికి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత వికాస్‌నగర్ కూడలిలో పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం సచివాలయంలో లబ్ధిదారులకు అందించిన పథకాలు, వాటి వివరాలతో కూడిన డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ, పేదలందరికీ పారదర్శకంగా పథకాలను వైసిపి ప్రభుత్వం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో వార్డు నాయకులు మద్దాల అప్పారావు, లోకనాథం, నగిశెట్టి శ్రీనివాస్, మంగు నాయుడు, ఇరోతి గణేష్, పెండ్ర రాజు, సింగంపల్లి దేముడు, అప్పలరాజు, గొల్లపల్లి రాంబాబు, పులి పెంటయ్యరెడ్డి, రామస్వామి, సత్యం, షాజన్ సింగ్, రమేష్, సుందరరావు, ఆర్మీ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస : భీమిలి మండలం సింగనబంద గ్రామంలో ఇంటింటా ప్రచారం చేశారు. నాలుగేళ్ల కాలంలో వ్యక్తిగతంగా జరిగిన లబ్ధిని తెలిపే బ్రోచర్‌ను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దంతులూరి వెంకటశివ సూర్య నారాయణ రాజు, జడ్పిటిసి సభ్యులు గాడు వెంకటప్పుడు, సర్పంచ్ గాడు వెంకట నారాయణ, పార్టీ మండల అధ్యక్షులు గాడు శ్రీను, దాకమర్రి ఎంపిటిసి సభ్యులు చెల్లూరి నగేష్‌బాబు, నాయకులు పొట్నూరు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావు, జి.ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



పథకాల ప్రచార బోర్డులను ప్రదర్శిస్తున్న కెకె.రాజు

ఆనందపురం : ఆనందపురంలో స్థానిక సర్పంచ్ చంద్రక లక్ష్మి ఆధ్వర్యాన 'ఆంధ్రప్రదేశ్ జగనే ఎందుకు కావాలంటే..' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు హాజరై నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు బంక సత్యం, నాయకులు పాండ్రంకి శ్రీను, బొట్ట రామకృష్ణ, చందక సూరిబాబు, పాండ్రకి అప్పారావు, శినగం పెద్దరామారావు, చిన్న రామారావు, చందక అప్పలస్వామి, రౌతు వెంకట్రావు, రౌతు శ్రీను పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డు పరిధి శాంతిపురం, లాల్ బహదూర్ శాస్త్రి పార్కు వద్ద వైసిపి ఇన్‌ఛార్జి పీలా వెంకటలక్ష్మి ఆధ్వర్యాన, 47వ వార్డు పరిధి అంబేద్కర్ ఎస్టేట్‌లో జివిఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు కంటిపాము కామేశ్వరి ఆధ్వర్యాన, 48వ వార్డు పరిధి ఇందిరానగర్-3 హైవే సర్వీసురోడ్డులో వార్డు వైసిపి ఇన్‌ఛార్జి నీలి రవి ఆధ్వర్యాన, 54వ వార్డు పరిధి కంచరపాలెం రైతు బజార్ వెనుక జివిఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు చల్లా రజని ఆధ్వర్యాన 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..' కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, నెడ్ క్యాప్ ఛైర్మన్ కెకె.రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయా సచివాలయాల పరిధిలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి పనులు వివరాలతో ఏర్పాటుచేసిన బోర్డులను ప్రారంభించారు. జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన అంశాలన్నింటినీ అమలుచేసిన ఘనత ముఖ్యమంత్రికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జివిఎంసి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, నాయకులు కృష్ణారావు మాస్టర్, బలుసు జగదీష్, అమర్‌రెడ్డి, వసంతల అప్పారావు, చిరంజీవి, నవాబ్, గండ్రేటి రవి, సుకుమార్, విజయ్, రమణమ్మ, పద్మ, కుమార్, అప్పలరాజు, హేమంత్, జాన్సన్, భాషా, శంకర్, ఎపిడిలు దుర్గాప్రసాద్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ములగాడ : జివిఎంసి 40వ వార్డులో వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజల ముంగిటకు పాలన తీసుకెళ్లారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ కలిదిండి బద్రీనాథ్, భోగవెల్లి నాగభూషణం, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఏపీఐఐసి-బ్ల్యూపి ఛైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్ అన్నారు. మండలంలోని బవులవాడలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దిలీప్ కుమార్, ఎంపిపి గొర్లి సూరిబాబు, వైసిపి మండల అధ్యక్షులు పెద్దిశెట్టి గోవింద తదితరులు మా నమ్మకం నువ్వే జగన్ బోర్డును ప్రారంభించారు. వాలంటీర్లకు జగనన్నే మా నమ్మకం అనే కిట్లను పంపిణీ చేశారు. వైసిపి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మజ్జి లక్ష్మి, వైసిపి నాయకులు మజ్జి వెంకట అప్పారావు, దాడి కుమార్, నక్క రమణ, జె.రామకృష్ణ, శ్రీను, బుజ్జి, వెంకట్రావు, అధికారులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చింతపాకలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పిటిసి దొండ రాంబాబు మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోలజన శ్రీను, వైసిపి మండల అధ్యక్షులు జోగా కొండబాబు, దాకారపు నాగరాజు, కోరుకొండ అప్పలనాయుడు, కరణం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చీడికాడ: మండలంలోని బయలుపూడిలో శుక్రవారం ఎపికి జగనే సిఎం ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. వైసిపి పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరాలను ఇఓపిఆర్‌డి కామేశ్వరరావు చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపిపి కురచా జయమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రజలకు జగన్ ఎన్నో సంక్షేమ పథకాలను అందించారన్నారు. ముఖ్యమంత్రిగా జగన్‌ను, ఎమ్మెల్యేగా ఉపముఖ్యమంత్రి ముత్యాల నాయుడును మరోసారి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లాలం శారద జానకిరామ్, మండల కన్వీనర్ రాజుబాబు, యూత్ అధ్యక్షుడు స్వామి నాయుడు, మండల సచివాలయం కన్వీనర్ చైతన్య, సర్పంచ్ సలాది ధనలక్ష్మి, గంగ శేషు పాల్గొన్నారు.

యస్ రాయవరం : మండలంలోని గుడివాడ గ్రామంలో శుక్రవారం రాత్రి ఎపికి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పాల్గొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, మళ్లీ వైసిపి ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ధూళి శ్రీను బాబు ఎం.పి.పి కొన లోవలక్ష్మి వైయస్సార్ పార్టీ నాయకులు శ్రీపతిరాజు పాల్గొన్నారు.

బస్సు ప్రమాదాలను అరికట్టాలని ధర్నా

కార్మికులకు రక్షణ కల్పించాలని సిఐటియు డిమాండ్



ధర్నా చేస్తున్న సిఐటియు నేతలు, కార్మికులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

పరిశ్రమల బస్సు ప్రమాదాలను అరికట్టాలని, కార్మికులకు రక్షణ కల్పించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం అచ్యుతాపురంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము మాట్లాడుతూ ఎస్ఇజెడ్‌లోని పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులను విధులకు, తిరిగి ఇళ్లకు చేర్చే బస్సులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయని, దీంతో కార్మికులు తమ ప్రాణాలకు రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అచ్యుతాపురం లారస్ కంపెనీ బస్సు ప్రమాద సంఘటన మరువకముందే, పరవాడలో మరో బస్సు ప్రమాదం చోటుచేసుకొని ఫార్మా కంపెనీ కార్మికుడు వెంకటేష్ మృతి చెందారని తెలిపారు. కంపెనీల బస్సు ప్రమాదాలలో మృతి చెందిన కార్మికులకు కోటి రూపాయలు పరిహారంగా చెల్లించాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, ఈ కాలంలో వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాద సంఘటనలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ మండల కన్వీనర్ కె.సోమునాయుడు, కార్మికులు పూడి చందు, శివకోటి, శివరాయ అప్పారావు, సూరంపూడి రమణ, సిహెచ్.రాజు పాల్గొన్నారు.

ప్రమాదాలపై విచారణ చేయాలని ఆర్‌టిఒకు వినతి

అనకాపల్లి : జిల్లాలోని వివిధ పరిశ్రమలలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులను డ్యూటీలకు చేరవేసే ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయని, ఆ ప్రమాదాలపై విచారణ చేయాలని కోరుతూ శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో ఆర్టీవో జిల్లా అధికారి ప్రకాశరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్ శంకర్రావు, జి కోటేశ్వరరావు మాట్లాడుతూ యాజమాన్యం డ్రైవర్లతో ఓవర్ డ్యూటీలు, సమయపాలన లేకుండా పనిచేయించడంతో తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ఒకే డ్రైవర్‌ను అన్ని షిఫ్టులో పని చేయించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఆర్‌టిఒ అధికారులు బోర్డులు పెట్టినా ఓవర్ లోడ్లతో ఈ మార్గంలో భారీ వాహనాలు తిరుగుతున్నాయని తెలిపారు. అనకాపల్లి-అచ్యుతాపురం రోడ్డులో భారీ వాహనాలు నిషేధించాలని, ప్రమాదాలు నివారణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, కోశాధికారి వివి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు



కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఎంవిఆర్

ఎంవిఆర్ ట్రస్టు ఆధ్వర్యాన ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి- అనకాపల్లి

ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు ఆర్థిక సహాయంతో నడుస్తున్న ఎంవిఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి, అనకాపల్లి రాజా ఆప్టికల్ అండ్ కంటి ఆసుపత్రి సంయుక్తంగా శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఎంవిఆర్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని ముత్యాల వెంకటేశ్వరరావు తన తనయుడు సతీష్ (సంజు)తో కలిసి ప్రారంభించారు. ఈ శిబిరంలో 230 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి కావలసిన మందులను అందజేశారు. వీరిలో 43 మందిని కంటి శుక్లాల ఆపరేషన్‌కి గుర్తించి వారిని శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. వారికి కావలసిన వైద్య సదుపాయాలను అనకాపల్లి రాజా ఆప్టికల్స్, కంటి ఆసుపత్రిలో అందజేస్తారని ఎంవిఆర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంవిఆర్ యువసేన, సంజుబాబు టీము సభ్యులు, శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు సతీష్, కంటి డాక్టర్ పి దేవిప్రభాకర్, రాజా ఆప్టికల్స్ అధినేత పూసర్ల రాజా పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎర్రయ్యదొర



ప్రజాశక్తి-యలమంచిలి రూరల్ : యలమంచిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పెద్దపల్లికి చెందిన బొద్దపు ఎర్రయ్య దొరను నియమిస్తూ అగ్రికల్చర్ కో-ఆపరేషన్ డిపార్ట్మెంట్ ఉత్తర్వులు జారీ చేసింది. యర్రయ్య దొర గతంలో యలమంచిలి జెపిటిసి సభ్యునిగా 2001 నుంచి 2006 వరకు పదవి బాధ్యతలు నిర్వర్తించారు. అలాగే 2006 నుంచి 2011 వరకు యలమంచిలి ఎంపిపిగా పని చేశారు. 2014 నుంచి నేటి వరకు వైసిపి యలమంచిలి మున్సిపాలిటీ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వైసిపి బలోపేతానికి కృషి చేయడంతో యలమంచిలి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎర్రయ్యదొరను నియమిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. దీంతో వైసిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు శ్రేయోభిలాషులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా యర్రయ్య దొర మాట్లాడుతూ ముందుగా ఎమ్మెల్యే కన్నబాబురాజుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధిష్టానం తనను గుర్తించి ఈ పదవి ప్రకటించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

కరువు ప్రాంతంగా ప్రకటించాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో వర్షాభావంతో తీవ్ర కరువు పరిస్థితిని ఎదుర్కొంటున్న మండలాలన్నింటిని కరువు ప్రాంతాలుగా ప్రకటించి యుద్ధప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా రెవెన్యూ అధికారి దయానిధిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావంతో దెబ్బతిన్న ఆహార పంటలకు ఎకరాకు రూ.50 వేలు, వాణిజ్య పంటలకు రూ.75వేలు, ఉద్యాన పంటలకు లక్ష రూపాయలు నష్టపరిహారం రైతులకు, కౌలు రైతులకు ఇవ్వాలని కోరారు. ఖరీఫ్ పంట రుణాలను మాఫీ చేయాలని, వలసలు అరికట్టేందుకు ఉపాధి హామీ పనులు పూర్తిస్థాయిలో ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. మంచినీటి కొరత ఉన్న గ్రామాల్లో రక్షిత మంచినీరు అందించాలని, పశువులకు పశుగ్రాసం, దాణా ఉచితంగా సరఫరా చేయాలని, పంటల బీమా, వాతావరణ బీమా పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రాజాన దొరబాబు, మాకిరెడ్డి రామునాయుడు, రెడ్డిపల్లి అప్పలరాజు, వైఎన్ భద్రం, కోరిబిల్లి శంకర్రావు, వియ్యపు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ రైతులకు ధ్రువపత్రాలు పంపిణీ చేస్తాం

ప్రజాశక్తి- కె.కోటపాడు : మేలైన యాజమాన్య పద్ధతులతో పంటలు పండించే ఉత్తమ రైతులకు ధ్రువపత్రాలు అందిస్తామని ఏపీ స్టేట్ ఆర్గానిక్ ప్రొడక్ట్స్ అథారిటీ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ రవి తెలిపారు. మండలంలో వారాడ పంచాయతీలో చేపడుతున్న పొలంబడి కార్యక్రమాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వ సూచనల ప్రకారం రైతు పొలాల నుండి మూడు శాంపిల్స్ తీసుకుని నాణ్యత ప్రమాణాలపై స్టేట్ ల్యాబ్‌కు పంపడం జరుగుతుందని చెప్పారు. వారు సూచించిన ప్రకారం ఉంటే ఆ రైతులకు ధ్రువపత్రాలు అందిస్తామన్నారు. ఆ సర్టిఫికెట్ ద్వారా రైతులకు మంచి గిట్టుబాటు ధర లభిస్తుందని చెప్పారు. వ్యవసాయ శాఖ ఏడి రవీంద్రనాథ్ మాట్లాడుతూ వారాడ గ్రామంలో 15 మంది రైతులను గుర్తించి మేలైన పద్ధతులతో పంటలు పండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడి ఏ శ్రీధర్, ఏవో సోమశేఖర్, చిరంజీవి, గాయత్రి, విజేత రైతులు గొర్రెపోటు వెంకటరావు, లెక్కల ముత్యాల నాయుడు, ఎడ్ల తాతారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, కర్షక మహాధర్నాపై ప్రచారం



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు శ్రీనివాసరావు

ప్రజాశక్తి-రాంబిల్లి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వ, కార్మిక, కర్షక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అఖిలభారత కార్మిక, రైతు సంఘాల పిలుపు మేరకు ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరుగు మహాధర్నాకు తరలిరావాలని కోరుతూ శుక్రవారం పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. రాంబిల్లి మండలంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు. జి.దేముడు నాయుడు, ఆటో కార్మికులు, స్కీమ్ వర్కర్సు కరపత్ర ప్రచారం చేశారు. ఈ సందర్భంగా దేముడునాయుడు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం 8 గంటలు పని విధానాన్ని 12 గంటలకు పెంచేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు శేషు, అప్పారావు, ఎండిఎం నాయకులు మూర్తి, రామలక్ష్మి, శానిటేషన్ వర్కర్లు ఎం.దేవి, రాజేశ్వరి, కార్మికులు పాల్గొన్నారు.

కశింకోట : ప్రజా సంఘాలు, స్కీమ్ వర్కర్లతో కశింకోటలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, మహిళలకు రక్షణ కల్పించాలని, కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు తనూజ, శ్యామల, ఎపిఎస్ఇబి యూనియన్ నాయకులు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా నాయకులు డిడి.వరలక్ష్మి, మిడ్డేమీల్స్ యూనియన్ నాయకులు శ్రీదేవి, సత్యవతి, మహాలక్ష్మి, ముఠా యూనియన్ నాయకులు నూకరాజు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

చోడవరం : విజయవాడ మహాధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను శుక్రవారం చోడవరంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జి.వరలక్ష్మి మాట్లాడుతూ రైతులు పండించే పంటకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, విశాఖ స్టీల్ ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. విజయవాడ మహాధర్నాలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా నాయకులు కె.వరలక్ష్మి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్‌వి.నాయుడు, మిడ్డేమీల్స్ కార్మికులు ఎస్‌కె అమీనా, నారాయణమ్మ, స్కూల్ కార్మికులు దేవి, లక్ష్మి పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరుగు మహాధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు కోరారు. శుక్రవారం నర్సీపట్నం కృష్ణాబజారు సెంటర్‌లో మహాపడవ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అడిగర్ల రాజు మాట్లాడుతూ కార్మిక, రైతు సంఘాల అద్వర్యంలో విజయవాడలో జరుగు మహాపడవ్‌కు నర్సీపట్నం కార్మిక, రైతాంగం తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. బిజెపి ప్రభుత్వం పాలనలో దేశం అభివృద్ధి తిరోగామం పడుతుందన్నారు. దేశ సంపద కార్పొరేట్ల పాలవుతుందన్నారు. సంవత్సరానికి రెండు కోట్లు ఉద్యోగాలు బిజెపి హామీ ప్రకటనకే పరిమితమైందన్నారు. కార్మిక, రైతాంగం సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న మహాపడవ్‌ను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ముఠా కార్మిక సంఘం నాయకులు ఎం.రమణ, అప్పలనాయుడు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

నూతన డిప్యూటీ డిఇఒను కలిసిన యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక జీవీఎంసీ పట్టణ బాలికల ఉన్నత పాఠశాలను శుక్రవారం నూతన జిల్లా ఉప విద్యాశాఖాధికారి పెన్నాడ అప్పారావు సందర్శించిన సందర్భంగా ఆయన్ను ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా నాయకులు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న ప్రధానోపాధ్యాయుల, మండల విద్యాశాఖ అధికారుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ కోరారు. దీనికి డిప్యూటీ డిఇఒ అప్పారావు స్పందిస్తూ, అన్ని సమస్యలను పరిష్కరించి విద్యాశాఖను అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, అనకాపల్లి ఎంఈఓ చిట్టిబాబు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, సీనియర్ నాయకులు బాబురావు, తేజ్ వర్ధన్, శైలజ తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ డిఇఒను సత్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి

ఎపి రైతు సంఘం నేతలు నాయనబాబు, ముత్యాలునాయుడు

ప్రజాశక్తి- కె.కోటపాడు

ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలకు తడిసిన వరి ధాన్యాన్ని ఎటువంటి షరతులు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు, సహాయ కార్యదర్శి రొంగలి ముత్యాలు నాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని పోతనవలస, వారాడ, ఆర్‌వై. అగ్రహారం తదితర గ్రామాలలో శుక్రవారం వారు పర్యటించి కోసి తరువాత వర్షానికి తడిసి ముద్దయిన వరి పనలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం రైతుల పరిస్థితి ఇటు చూస్తే నుయ్యి అటు చూస్తే గొయ్యి లాగా ఉందన్నారు వరి ఆకులు వేసినప్పటినుంచి ఇప్పటివరకు తీవ్ర వర్షాభావ పరిస్థితి వల్ల అనేక ఇబ్బందులు పడి నీరు సౌకర్యం ఉన్నచోట రైతులు వరి పంటను పండించారని తెలిపారు. ఇప్పుడు పండిన పంటను కోత కోసి పొలంలో ఆరబెట్టగా, అకాల వర్షాల వలన తడిసి ముద్దయ్యాయన్నారు. రాష్ట్రంలో 400 వరకు మండలాలు తీవ్ర కరువు పరిస్థితులతో అల్లాడుతుండగా రాష్ట్ర ప్రభుత్వము కేవలం 103 మండలాలలో కరువు ఉందని వాటిని మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించి రైతులకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. తడిసిన వరి పొలాలను అధికారులు పరిశీలించి నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించాలన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం ఎటువంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని, అనకాపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు.



తడిసిన వరి పనలను చూపుతున్న రైతు నాయకులు

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : రాష్ట్రంలో నెలకొన్న కరువును జాతీయ విపత్తుగా ప్రకటించి తక్షణమే రైతులను, ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం కరువు సహాయక చర్యలు చేపట్టాలని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు వైసీపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు ఆయా పంటలను బట్టి ఎకరాకు 25వేల నుండి 50 వేల నష్టపరిహారాన్ని చెల్లించాలని కోరారు. నవంబర్ నాటికి సహాయక చర్యలు చేపట్టవలసి ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం తగదన్నారు. అదానీ ప్రయోజనాల కోసం విద్యుత్ చార్జీలు భారీగా పెంచారని, రూ.200 బిల్లు ఉన్న సామాన్యుడికి రూ.500 వస్తుందని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు కాండ్రేగుల సత్యనారాయణ, వేగి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు బీసీల రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలోని నూకంబిక అమ్మవారి కోవెల దగ్గరలో సత్య లక్ష్మి గ్రాండ్ ఫంక్షన్ హాల్లో ఈ నెల 25న శనివారం బీసీ సామాజిక తరగతుల వారి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగజదీశ్వరరావు తెలిపారు. టిడిపి జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి కిమిడి కళా వెంకట్రావు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశానికి బీసీ సామాజిక తరగతికి చెందిన నాయకులు, ప్రజలు హాజరు కావాలని కోరారు. ఈ విలేకర్ల సమావేశంలో జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు గిరజాల లక్ష్మణరావుయాదవ్, పార్లమెంట్ కార్యాలయం కార్యదర్శి బొలిశెట్టి శ్రీనివాసరావు, బీసీ నాయకులు సబ్బి శ్రీనివాస్ యాదవ్, కార్యాలయ మేనేజర్ కర్రి నాయుడు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-అనకాపల్లి : నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో ఈ ఏడాది సెప్టెంబర్ 17 నుండి నవంబర్ 24 వరకు (68 రోజులకి) హుండీ లెక్కింపు శుక్రవారం చేపట్టారు. ఆలయ ఛైర్మన్ కొణతాల మురళీకృష్ణ, సహాయ కమీషనర్ ఈఓ బండారు ప్రసాద్, అనకాపల్లి జిల్లా దేవదాయ, ధర్మదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీధర్, ధర్మకర్తల పర్యవేక్షణలో అమ్మవారి హుండీ లెక్కింపు జరిగినది. లెక్కింపులో రూ.23,96,658, నగదు, 30 గ్రాముల బంగారం, 1కేజీ 200 గ్రాముల వెండి వచ్చింది. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు బుద్ధ నర్సింగరాజు, పీలా లక్ష్మి శ్రీనివాసరావు, ఆడారి ఉమా శ్రీనివాసరావు, కొండూరి రవీంద్రనాథ్, గొల్లవిల్లి నర్సింగరావు, పాము అనురాధ సన్నిబాబు, కంటపల్లి శోభారాణి వెంకటరావు, మళ్ళవరపు ఈశ్వర్రావు, అర్చకులు యానమంద్ర శ్రీనివాసరావు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌ను కలిసిన నాగ జగదీష్

ప్రజాశక్తి-అనకాపల్లి : జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను విశాఖపట్నం ఎయిర్ పోర్టులో టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగజగదీశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిశారు. మత్స్యకారులకు ఆర్థిక సహాయం అందించడానికి శుక్రవారం పవన్ కల్యాణ్ విశాఖకు వచ్చిన నేపథ్యంలో ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ పాల్గొన్నారు.

నేడు కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-కశింకోట : కశింకోటలో స్వయంభూగా వెలసిన నూకాంబిక అమ్మవారు ఆలయ ప్రాంగణంలో కల్యాణ మండపం నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేయనున్నట్లు వైసిపి జిల్లా అధికార ప్రతినిధి మళ్ళ బుల్లిబాబు తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భక్తులుకు అందుబాటులోకి రెండు కళ్యాణమండపాలు కోటి రూపాయల నిధులతో చేపడుతున్నట్లు చెప్పారు. అమ్మవారి గుడి ప్రాంగణం అంతా ప్రహరీ నిర్మాణం కూడా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, ఎంపీ డాక్టర్ బివి సత్యవతి, పార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు వేగి గణేష్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లేగ దూడల ప్రదర్శన



బహుమతులు అందజేస్తున్న అధికారులు

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామంలో రాజి శ్రీనివాసరావు కల్లాల వద్ద శుక్రవారం ఏపీ పశు సంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన జాతీయ పశు కృత్రిమ గర్భధారణ కార్యక్రమంలో భాగంగా లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా పశు వర్ధక శాఖ సహాయ సంయుక్త సంచాలకులు బి. ప్రసాదరావు మాట్లాడుతూ అప్పుడే పుట్టిన లేగ దూడకు ముర్రు పాలు అధికంగా తాగించాలని, దాని వల్ల రోగ నిరోధక శక్తి అధికంగా ఉంటుందని తెలిపారు. రైతులు మేలు జాతి పాడి పశువులను పోషించుకోవాలని, వాటికి పుట్టిన లేక దూడలను శ్రద్ధగా పెంచినట్లయితే ఒక ఏడాది కాలంలో ఎదకు వస్తాయని చెప్పారు. గడ్డి కటింగ్ మిషన్ కావాల్సిన రైతులకు ప్రభుత్వం రాయితీపై రూ.20 వేలు అందిస్తుందన్నారు. ఈ లేగ దూడల ప్రదర్శనకు గ్రామం నుంచి 39 లేగ దూడలు రాగ వీటిలో ప్రథమ బహుమతి రాపేటి ప్రసాదు, రెండవ బహుమతి త్రిశూలం రాము లేగ దూడలకు దక్కాయి. ప్రదర్శన వచ్చిన వారందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దాడి ఎరుకు నాయుడు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, పశువర్ధక శాఖ డిడి కరుణాకర్‌రావు, డిఎల్‌డిఏ ఈవో రామ్మోహన్‌రావు, ఏడి బైరాగి, పశువుల అధికారులు ఎర్రి నాయుడు, బి.సంధ్య, బాల మౌనిక, పాల సొసైటీ అధ్యక్షులు కుమార వెంకటరమణ, సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ రాజి శ్రీనివాసరావు, గోపాల్ మిత్ర ఈర్లె నాయుడుబాబు, రైతులు పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలపై నిరసన

ప్రజాశక్తి- కశింకోట : అప్రకటిన విద్యుత్ కోతలపై తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని తాళ్లపాలెం ఆర్ఇసిఎస్ కార్యాలయాన్ని శుక్రవారం ముట్టడి చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మూడు రోజులు నుంచి వ్యవసాయానికి రాత్రి సమయంలో అర్ధరాత్రి ఒంటి గంట నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు విద్యుత్ సరఫరా చేయడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కోత వల్ల బెల్లం రైతులు, వ్యవసాయ రైతులు, పశువులు నీళ్ళు లేక తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతు పట్ల నిరంకుశంగా వ్యవహారిస్తూ నడ్డి విరుస్తుందన్నారు. అప్రకటిత కరెంటు కోతలు విధిస్తూ చెరుకు రైతుకు మరింత నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయాన్ని దారుణంగా దెబ్బతీస్తూ సంక్షోభంలోకి నెట్టేస్తూ అసలే కరువుతో అల్లాడుతున్న వ్యవసాయ రంగంతో మరింత ఇబ్బందుల్లోకి నెట్టడం దారుణమన్నారు. ఈ విషయంపై ఏఈ బిఎల్ నాయుడుకు వినతి పత్రం ఆందజేశారు. దీనికి స్పందించి ఆయన మాట్లాడుతూ వెంటనే వ్యవసాయ మోటార్లకు కరెంటు పునరుద్ధరిస్తామని హామీ ఇవ్వడంతో నిరసనకారులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం ప్రెసిడెంట్ కాయలు మురళి, ఉపాధ్యక్షులు కలగా సోమేశ్వరావు, మజ్జి నిరంజన్ కుమార్, చెరుకు రైతులు రామారావు, చిన్ని కోటేశ్వరావు, కోన నాగేశ్వరావు, సుందరపు ప్రసాద్, కలగా ఏసు, సోమరాజు, ఆనాల తాతయ్య నాయుడు పాల్గొన్నారు.

పిహెచ్‌సి వైద్యాధికారి బదిలీ

వివాదాల నేపథ్యంలో చర్యలు తీసుకున్న అధికారులు

ప్రజాశక్తి- దేవరాపల్లి

దేవరాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్.లలితను తూర్పుగోదావరి జిల్లా అన్నదేవరపేట పిహెచ్‌సికి బదిలీ చేస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ వి.రామారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ లలిత వ్యవహారశైలిపై ఈ ఏడాది ఆగస్టు 8న సీనియర్ అసిస్టెంట్ మోహన్, పుష్పరాజ్, మరో ముగ్గురు సిబ్బందితోపాటు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి వెంకన్న స్పందనలో ఫిర్యాదు చేయడంతో, ఈ నెల 11న అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హేమంత్ విచారణ చేసిన విషయం విధితమే. అలాగే జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారి విచారణ చేసి డైరెక్టర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అధికారులకు నివేదిక పంపించారు. ఈ నేపథ్యంలో విచారణను పరిశీలన అనంతరం డాక్టర్ లలితను తూర్పుగోదావరి అన్నదేవరపేట పీహెచ్సీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది.



డాక్టర్ లలిత

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ప్రజాశక్తి- కశింకోట : మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని తాళ్లపాలెం గ్రామీన బ్యాంకు మేనేజర్ లక్ష్మి అన్నారు. మండలంలోని తాళ్లపాలెం ఎస్‌హెచ్ గ్రూపులతో శుక్రవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళా బ్యాంకు లావా దేవీలపై అవగాహన వుండాలన్నారు. ఏపిఎం శ్రీనివాసరావు, సిసి రామకృష్ణ, సిఏలు భ్రమరాంబ, చిట్టీ, మహిళా పాల్గొన్నారు.

బాలస్వామిని కలిసిన టైటస్

ప్రజాశక్తి-దేవరాపల్లి : ప్రధానమంత్రి మైనార్టీ 15 పాయింట్ల ప్రోగ్రాం జిల్లా సభ్యులు డాక్టర్ టైటస్ గొర్లె శుక్రవారం విశాఖపట్నంలోని సర్క్యూట్ హౌస్‌లో రాష్ట్ర క్రిస్టియన్ అఫైర్స్ మైనార్టీ వెల్ఫేర్ అడ్వైజర్ డాక్టర్ బాలస్వామిని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. క్రైస్తవులకు, పాస్టర్స్‌కు సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు, గౌరవ వేతనం గురించి చర్చించారు. బాలస్వామిని కలిసిన వారిలో చింతాడు మోహన్ రావు, జేమ్స్‌వి కే కుంపట్ల, బ్రదర్ డేవిడ్ తదితరులు ఉన్నారు.

వైసిపి సమావేశాలకు అధికారులు వెళ్లడం సరికాదు

ప్రజాశక్తి - పరవాడ : వైసిపి సమావేశాలకు ప్రభుత్వ అధికారులు, సిబ్బంది వెళ్లడం సరికాదని టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్న శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం పెందుర్తి నియోజక వర్గం పరిధిలోని సబ్బవరంలో జరిగే వైసిపి సామాజిక సాధికార బస్ యాత్రకు ప్రభుత్వం నుండి వేతనం తీసుకుంటున్న ప్రభుత్వ అధికారులు పాల్గొనడం ఏమిటని ప్రశ్నించారు. బస్సు యాత్ర ప్రారంభోత్సవం, సంక్షేమ పథకం ఇచ్చే కార్యక్రమం, ప్రజలకు ఉపయోగపడే పని, కొత్త పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం వంటివి కాదని, అది వైసిపి కార్యక్రమమని పేర్కొన్నారు. ఈ బస్సు యాత్రకు వెళ్తే సంబంధిత అధికారులపై ఎలక్షన్ కమిషన్‌కు, జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు.

డ్రెయినేజీ నిర్మాణం శిలాఫలకానికే పరిమితం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని రావాడ గ్రామ పంచాయితీ పరిధిలో రూ.30 లక్షలతో డ్రైనేజి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన నాలుగేళ్లు కావస్తున్నా నేటికీ పనులు ప్రారంభం కాలేదని టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్న పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పనులకు పెందుర్తి శాసన సభ్యులు అన్నం రెడ్డి అదీప్ రాజు 2020 జనవరిలో శంకుస్థాపన చేశారని, అక్కడ ఇప్పటి వరకు కనీసం ఎటువంటి పనులు మొదలు పెట్ట లేదని, ఆ నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. అసలు ఆ నిధులు ఉన్నాయా? లేవా, ఉంటే ఎందుకు పనులు చేయలేదని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం శిలా ఫలకాలకే పరిమితమా లేక ఏమైనా పనులు చేసే ఉద్దేశం ఉందా ప్రజలు అడుగుతున్నారని తెలిపారు. ఇలాంటి దౌర్భాగ్య ప్రభుత్వం మనకి అవసరమా అని వియ్యపు చిన్న ప్రశ్నించారు.

కార్తీక వనభోజనంలో పాల్గొన్న డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి-దేవరాపల్లి : కార్తీక శుక్రవారాన్ని పురస్కరించుకుని మండలంలోని మారేపల్లి గ్రామ సమీపంలో జీడి తోటలో శుక్రవారం గోర్రుపోటు రామదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వన భోజనాలు కార్యక్రమంలో డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు సతీసమేతంగా పాల్గొన్నారు. ముందుగా ఉసిరచెట్టుకు పూజలు నిర్వహించిన అనంతరం మహిళలతో మాట మంతీ కలిపి మాట్లాడారు. అనంతరం డిప్యూటీ సీఎం అందరితో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసంపూర్తి కాలువతో అవస్థలు



సగం వరకు నిర్మించి వదిలేసిన మురుగుకాలువ

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో కొడవటిపూడి గ్రామంలో ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో ప్రధాన రహదారిని అనుకుని రూ.20 లక్షలతో 350 మీటర్ల సిమెంటు కాంక్రీట్ కాలువ నిర్మాణం చేపట్టారు. అయితే దీన్ని పూర్తిగా నిర్మించకుండా అరకొరగా వదిలేయడంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, కాలువ నిర్మాణం పనులను సగంలోనే వదిలేయడం, కాలువ కోసం తీసిన గోతుల వద్ద ఎటువంటి రక్షణ చర్యలు లేకపోవడంతో అటుగా రాకపోకలు సాగించేవారు ప్రధానంగా రాత్రి సమయంలో అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది, దీనిపై ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్ గీతాంజలి వివరణ కోరగా ఇంకా ముప్పై మీటర్ల కాలువ నిర్మించాల్సి ఉందని,త్వరలో పూర్తి చేస్తామన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి అసంపూర్తి కాలువ నిర్మాణం పనులు పూర్తి చేయాలని ప్రాంత వాసులు కోరుకుంటున్నారు,

అద్దింట్లో అంగన్వాడీ కేంద్రాలు !

అవస్థలు పడుతున్న సిబ్బంది, చిన్నారులు

కొన్ని కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కరువు

తాగునీటికీ కటకట

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో అంగన్వాడీ కేంద్రాల పరిస్థితి మరి అధ్వానంగా తయారైంది, అంగన్వాడీ వ్యవస్థ ఏర్పడిన తొలినాళ్లలో ఇక్కడ సిడిపిఒ కార్యాలయం ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఉన్న కార్యాలయం ప్రస్తుతం నక్కపల్లి మండలానికి మార్చడంతో మండలంలో అంగన్వాడీ వ్యవస్థ మరింత జారిపోయింది, మండల వ్యాప్తంగా 82 అంగన్వాడీ కేంద్రాలకు గాను 23 కేంద్రాలు అద్దె కొంపల్లో కొనసాగుతున్నాయి, నాలుగు మాత్రం రెంట్ ఫ్రీలో కొనసాగుతూ ఉండగా, జల్లూరు, నీలిగుంట, చిన్న బొడ్డేపల్లి, తంగేడు, రామచంద్రపాలెం అంగన్వాడీ కేంద్రాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరో ఐదు భవనాల్లో ఆందోళనకరంగా విధులు నిర్వహిస్తున్నారు. నాడు నేడు నిధులతో చౌడువాడ , పీకే పల్లి, ఎండపల్లి



పి కొత్తపల్లి కేంద్రంలో పాడైన బోరు



ఇరుకుగా ఉన్న అద్దింట్లో వెంకటాపురం అంగన్వాడీ కేంద్రం

గ్రామాలలో కొత్త భవనాలను నిర్మిస్తున్నారు. అయితే కొన్ని భవనాల్లో నీటి సౌకర్యం, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది, అధికారులకు నాయకులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోలేదు స్థానికులు సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ఇదిలా ఉండగా కోటవురట్ల పోలీస్ స్టేషన్ వద్ద నూతనంగా నిర్మించిన అంగన్వాడీ కేంద్రం ప్రారంభానికి నోచుకోలేదు, ఈ విషయమై సూపర్వైజర్ దుర్గాదేవిని వివరణ కోరగా కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించక భవనం తాళాలను అప్పజెప్పలేదని, దీంతో భవనం ప్రారంభం కాలేదన్నారు.

గుండెపోటుతో తంగేడు మాజీ సర్పంచ్ మృతి



కొరుప్రోలు రాజులు (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి -కోటవురట్ల: తంగేడు గ్రామ మాజీ సర్పంచ్ కొరుప్రోలు రాజులు (82) శుక్రవారం ఉదయం గుండెపోటుతో మరణించారు, ఈయన 2001 నుంచి 2006 వరకు గ్రామ సర్పంచ్‌గా వ్యవహరించడంతో పాటు పిఎసిఎస్ డైరెక్టర్‌గా కొద్దికాలం పనిచేశారు. శుక్రవారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురైన ఈయనను కోటఉరట్ల సిహెచ్‌సి తీసుకువెళ్లగా పరిస్థితి విషమించడంతో నర్సీపట్నం ప్రైవేటు హాస్పటల్‌కు తరలించగా, అక్కడ మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు, అయితే రాజులు మృతితో గ్రామంలో విషాదఛాయలు అమ్ముకున్నాయి, గ్రామానికి విశిష్ట సేవలు అందించడంతోపాటు ప్రతి ఒక్కరితో మర్యాదపూర్వకంగా పలకరిస్తూ అజాతశత్రువుగా అందరి మన్ననలు అందుకున్న రాజులు మృతి తీరని లోటు పలువురు అంటున్నారు, మృతదేహానికి స్థానిక వైసిపి నాయకులు, కుటుంబ సభ్యులు బంధువులు నివాళులర్పించారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ



కె.కోటపాడులో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- కె.-కోటపాడు : ఓటు హక్కుపై యువతీ, యువకులకు అవగాహన కల్పించే నిమిత్తం తహశీల్దారు జె.రమేష్‌బాబు ఆధ్వర్యాన పలు శాఖ అధికారులు, ఉద్యోగులు శుక్రవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో తహశీల్దారు మాట్లాడుతూ ఓటు హక్కు పొందడానికి 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటర్లుగా నమోదు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ పివివిఎస్.ప్రసాద్, ఐకెపి ఎపిఎం లక్ష్మి, ల్యాండ్ రీసర్వే హెచ్‌డిటి సూరి, మండల ఆర్ఐ డి.జానకి, వీఆర్వోలు, ఎంపిడిఒ, ఐకెపి, ఎన్ఆర్ఇజిఎస్ కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండల తహశీల్దారు ఎం.లక్ష్మి ఆధ్వర్యంలో నూతన ఓటర్లను ఆకర్షించే విధంగా కళాశాల విద్యార్థులచే దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి నాలుగు రోడ్లు జంక్షన్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన అతి ప్రాముఖ్యమైన హక్కు అని, దానిని పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సిహెచ్ సుబ్బలక్ష్మి, ఎంఈఓ బి పడాల్ దాస్,పాల్గొన్నారు.

మాడుగుల: ఓటు నమోదు, దాని విలువపై శుక్రవారం స్థానిక తహశీల్దార్ పివి రత్నం ఆధ్వర్యంలో జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రత్నం మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కుగా ఓటును గుర్తించి, 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరు విధిగా ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. ఓటర్ల నమోదుకు జిల్లా పరిషత్ బాలుర, బాలికోన్నత పాఠశాల, గెడ్డబడి, ఆర్‌సిఎం పాఠశాలలలో ప్రత్యేక కౌంటర్లు అందుబాటులో ఉన్నాయన్నారు ఓటు నమోదుకు ఆధార్ కార్డ్, ఫోన్ నెంబర్, పదవ తరగతి మార్క్ లిస్ట్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ టి.నాగేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న వార్షిక కల్యాణోత్సవాలు



వేడుకల్లో పాల్గొన్న ఎంవిఆర్, సతీష్

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలం కొత్తకోట గ్రామంలో పద్మావతి భజన మండలి ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో అనకాపల్లికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త ముత్యాల వెంకటేశ్వరరావు, ఆయన తనయుడు ముత్యాల సతీష్ పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ మాజీ ఉపాధ్యక్షులు గంటా ఈశ్వరరావు, కొత్తకోట గ్రామ ఉప సర్పంచ్ పందల దేవ, వైసీపీ నాయకులు శీలం కళ్యాణ్, ఎం వి ఆర్ యువసేన సభ్యులు, భారీ స్థాయిలో మహిళలు పాల్గొన్నారు.

పశు ఆరోగ్య సంరక్షణ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి- చీడికాడ : మండలంలోని జైతవరం గ్రామంలో పాడి రైతులకు పశు ఆరోగ్య సంరక్షణ కార్డులను సర్పంచ్ కోడూరు సత్యవతి శుక్రవారం ఉదయం పంపిణీ చేశారు. పాడి పశువుల కు అనారోగ్యం, అత్యవసర సమయాల్లో 1962 నెంబరుకు ఫోన్ చేసి వైయస్సార్ పశు సంచార వైద్యశాల సేవలను పాడి రైతులు ఉపయోగించుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రం ద్వారా గడ్డి విత్తనాలు, పశువులకు దాణా కూడా సబ్సిడీపై రైతులకు ఈ కార్డులు ద్వారా అందిస్తామన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయకులు ఎం .శ్రీనివాసరావు, విశాఖ డెయిరీ ప్రతినిధి కోడూరు గోవిందరావు, దొకల రామునాయుడు పాల్గొన్నారు

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : మండలంలోని ధర్మసాగరం ప్రస్తుత ఎంపిటిసి పెట్ల అచ్చియ్యనాయుడు ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. దీంతో ఆ కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.4లక్షల చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అచ్చియ్యనాయుడు కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి సుర్ల రాజేశ్వరి, మండల పార్టీ అధ్యక్షులు సుర్ల సత్యనారాయణ, సర్పంచ్ గొంప కన్నయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో ఫ్రైడే డ్రైడే

ప్రజాశక్తి -యస్ రాయవరం : మండలంలోని పెనుగొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ధర్మవరం గ్రామంలోడిఎంఒ వరహాల దొర ఆదేశాల మేరకు వైద్యాధికారి డాక్టర్ రాజేశ్వరి ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేశ్వరి మాట్లాడుతూ, దోమలు వల్ల అనేక వ్యాధులు ప్రబలి, విజృంభించే అవకాశం ఉందన్నారు. దోమలు, వాటి లార్వాల నిర్మూలనకు ఇళ్లలోపల, పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని, వారానికి ఒకరోజు శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. అనంతరం మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నాయుడు పిహెచ్‌సిని సందర్శించి, ల్యాబ్ లో రికార్డులను తనిఖీ చేసి ల్యాబ్ టెక్నీషియన్‌కు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ వెల్నెస్ సెంటర్ పర్యవేక్షకులు షేక్ అమీర్ షాజిద్, హెల్త్ విజిటర్ నాగరత్నం, హెల్త్ సెక్రటరీ దాలియమ్మ, ఎంఎల్‌హెచ్ పి, ప్రమీల, ఆశా కార్యకర్త రాజ్యలక్ష్మి పార్వతి, మిగతా వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా చింతకాయల విజయ్ జన్మదిన వేడుకలు

కేకు కట్ చేసిన అభిమానులు

- రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ



రోగులకు పండ్లు, రొట్టెలు ఇస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. విజయ్ యూత్, తెలుగు యువత లాలం మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఏరియా ఆసుపత్రిలో ఉన్న రోగులకు పాలు, పండ్లు, అందజేశారు. అనంతరం అన్నక్యాంటీన్ వద్ద కేక్ కట్ చేసి నిరాశ్రయులకు భోజనం ప్యాకెట్లు అందించారు .కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నక్కపల్లి: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ జన్మదిన వేడుకలను శుక్రవారం నక్కపల్లిలో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. అనకాపల్లి జిల్లా ఐటిడిపి అధ్యక్షుడు భీమరశెట్టి శ్రీనివాస్ అధ్వర్యంలో స్థానిక 50 పడకల ఆసుపత్రిలో ఆసుపత్రి సూపరెంటెండెం ట్ ఈశ్వరప్రసాద్ ,పార్టీ శ్రేణులతో కలిసి రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గం ఐ టిడిపి అధ్యక్షులు మలిపెద్ది సతీష్, టిడిపి పార్లమెంట్ కమిటీ సభ్యులు రాంబాబు, నియోజవర్గ ప్రధాన కార్యదర్శి అల్లు మోహన్ , నక్కపల్లి ఇంచార్జ్ గంట్యాడ రమేష్, దువ్వ శ్రీనివాస్ , లోవరాజు, మద్దాల శ్రీనివాసరావు , మంచాల వంశీ, హరీష్, జగదీష్, శివ పాల్గొన్నారు.

గొలుగొండ : మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు తనయుడు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ పుట్టినరోజు వేడుకలు ఏఎల్ పురం గ్రామంలో మాజీ జడ్పిటిసి చిటికెల తారక వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కేకును కట్ చేశారు అనంతరం వృద్ధులకు దుప్పట్లో పండ్లు పంపిణీ చేశారు. స్థానిక పిహెచ్‌సిలో రోగులకు పాలు, రొట్టె, పండ్లు పంపిణీ చేశారు కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుందూరు అప్పారావు, మాజీ కోపరేటివ్ చైర్మన్ పెట్ల నారాయణమూర్తి, ఎంపీటీసీ రుత్తల శివరామకృష్ణ, సీనియర్ నాయకులు గాడి అప్పలనాయుడు, లగుడు సన్నిబాబు, ఏ ఎల్ పురం గ్రామ పార్టీ అధ్యక్షుడు బొడ్డు పోతురాజు (జమీలు), లగుడు రమేష్, రుత్తల శేఖర్, చిటికెల చిట్టిబాబు, నూతిగట్టు అప్పలరాజు, అంకంరెడ్డి వరహాలు, ఎంపియుపి స్కూల్ కమిటీ చైర్మన్ గొర్ల లక్ష్మణ్ అభిమానులు పాల్గొన్నారు.

'నాడు - నేడు' పనులపై అవగాహన

ప్రజాశక్తి -అనంతగిరి : నాడు నేడు నిధులతో అంగన్వాడీ భవనాలకు ఏ విధంగా మరమ్మతు పనులు చేపట్టాలో అనే దానిపై తల్లుల కమిటీ ఏర్పాటు చేసి సిబ్బందికి ప్రత్యేక శిక్షణ, అవగాహన కల్పించినట్లు సిడిపిఒ సంతోషి కుమారి తెలిపారు. పనులను ఏ విధంగా చేపట్టాలా అనేదానిపై అవగాహన శిక్షణ కల్పించామన్నారు.

జాతీయ బాక్సింగ్ పోటీలకు తేజస్విని


తేజస్విని

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : అఖిల భారత యూనివర్సిటీ బాక్సింగ్ పోటీలకు నర్సీ పట్నానికి చెందిన యర్రా తేజస్విని ఎంపికైంది. ఈ నెల 23న ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన జెఎన్‌టియు ఇంజనీరింగ్ బాక్సింగ్ పోటీల్లో తేజస్విని ప్రధమ స్ధానంలో నిలిచి, ఆల్ ఇండియా యూనివర్సిటీ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైనట్లు బాక్సింగ్ కోచ్ అబ్బు తెలిపారు. ఈ సందర్భంగా తేజస్వినిని బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ జగన్నాధ్,, వెలగా నారాయణరావు, సైకాలజీ టీచర్ సుమ , బోళెం శివ, సుతాపల్లి శ్రావణ్, సుతాపల్లి శ్రీకాంత్, పారుపల్లి శ్రీకాంత్ అభినందించారు

ఉమ్మడి మ్యానిఫెస్టోపై విస్తృత ప్రచారం


నక్కపల్లిలో .ప్రచారం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- నక్కపల్లి: మండలంలోని పెద తీనార్ల , చిన తీనార్ల గ్రామాల్లో శుక్రవారం క్లస్టర్ ఇన్చార్జి కొప్పిశెట్టి బుజ్జి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా టిడిపి, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోపై ముమ్మరంగా ప్రచారం చేపట్టారు. దీనికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. చంద్రబాబు ప్రకటించిన పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా కొప్పిశెట్టి బుజ్జి మాట్లాడుతూ రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలన్నా, ప్రజలకు సంక్షేమ పథకాలు అందాలన్నా చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావాలని ప్రజలకు కోరుకుంటున్నారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం జరిగిందన్నారు. అరాచక వైసిపి పాలనలో రాష్ట్ర ఎన్నో ఏళ్లు వెక్కు పోయిందన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బూత్ ఇన్చార్జిలు వాసుపల్లి సత్యం ,గరికిన నూకరాజు ,బొంది దేముడు, పేద తీనార్ల గ్రామ టిడిపి అధ్యక్షులు దేముడు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి పెద్ద పీట

బుచ్చయ్యపేట : టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టోలో మహిళా సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి బత్తుల తాతయ్య బాబు అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దమదీన గ్రామంలో బాబు షూరిటీ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఇసుక, మద్యం ద్వారా రోజుకు కోట్లాది రూపాయలను దోచుకుంటుందని, ఆ ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గోకివాడ కోటేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి వియ్యపు అప్పారావు, అబ్జర్వర్ మూర్తి యాదవ్, కొండపాలెం సర్పంచ్ ముచ్చకర్ల తాతీలు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి ఆలయంలో వెండి ఆభరణాల చోరీ

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని కాగిత గ్రామంలో దుర్గాదేవి ఆలయంలో బుధవారం రాత్రి వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయని ఎస్ఐ విభూషణరావు తెలిపారు. ఆలయంలో దుర్గాదేవి విగ్రహానికి అలంకరించిన సుమారు 900 గ్రాముల వెండి ఆభరణాలను దొంగలు చోరీ చేశారన్నారు. గురువారం ఉదయం ఆలయానికి వెళ్ళిన భక్తులు గమనించి ఫిర్యాదు చేయడంతో చోరీ జరిగిన ఆలయ ప్రాంతాన్ని పరిశీలించి ,విచారణ చేపట్టమన్నారు.

దారులన్నీ అధ్వానం!

- మురికికూపాలుగా గ్రామీణ రహదారులు!
- అవస్థలు పడుతున్న ప్రజలు, వాహనదారులు
- పట్టించుకోని నాయకులు, అధికారులు



ప్రయాణసంకటంగా కోటవురట్లలోని గ్రామీణ రోడ్లు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల వ్యాప్తంగా గ్రామీణ రహదారులన్నీ మురికికూపాలుగా దర్శనమిస్తున్నాయి, ప్రధానంగా వెంకటాపురం, రాజుపేట, అన్నవరం, సహా ప్రధాన రహదారి పోలవరం రోడ్డు కూడా పూర్తిగా పాడవ్వడంతో ఆయా ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు అవస్థలు ఎదుర్కొంటున్నారు, నిత్యం వివిధ సంక్షేమ పథకాల ప్రారంభోత్సవం, శంకుస్థాపన అంటూ తిరుగుతున్న స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబూరావు రహదారుల మరమ్మతులు, పునర్నిర్మాణంపై కనీసం దష్టి సారించకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని విమర్శలు వినిపిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే వెంకటాపురం రహదారి పూర్తిగా అధ్వానంగా ఉండడంతో ప్రజలతోపాటు వాహనదారులు పడే అవస్థలు అన్నీఇన్నీ కాదు. ఇదే పరిస్థితిలో రాజుపేట రహదారి కూడావుంది, ఈ రెండు గ్రామాలలో కూడా అధికార పార్టీ నాయకుల్లో జిల్లా స్థాయి పదవులు అనుభవిస్తున్నారని, అయినా వారికి ప్రజల కష్టాలు పట్టడం లేదనే ఆయా గ్రామీణ ప్రాంత ప్రజలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని నాయకులు ఇప్పటికైనా స్పందించి రహదారులు నిర్మాణం చేపట్టాలని ఆ పార్టీ నాయకులతో పాటు కార్యకర్తలు కోరుకుంటున్నారు. లేకుంటే రానున్న ఎన్నికల్లో దాని ప్రభావం ఎదుర్కోక తప్పదని హెచ్చరిస్తున్నారు.

హెటిరో పైప్‌లైన్ పనులు నిలుపుదల చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న అప్పలరాజు, మత్స్యకారులు

ప్రజాశక్తి -నక్కపల్లి : హెటిరో డ్రగ్స్ కొత్తగా వేస్తున్న పైపులైను పనులు వెంటనే నిలుపుదల చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు డిమాండ్ చేశారు .శుక్రవారం స్థానిక మత్స్యకారులతో కలిసి తహసీల్దార్ అంబేద్కర్ణ్‌కు వినతిపత్రం అందజేశారు .ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ రెవిన్యూ, ఫారెస్ట్ భూముల గుండా అక్రమంగా, ఎటువంటి అనుమతులు లేకుండా హెటిరో కొత్త పైపులైన్ పనులు ప్రారంభించారన్నారు. కొత్త పైపులైన్ ఏర్పాటుకు రెవెన్యూ, ఫారెస్ట్ భూములు కేటాయించకుండా పనులు జరుగుతున్నా ఆయా శాఖల అధికారులు పట్టించుకోకపోవడం అన్యాయం అన్నారు. వెంటనే అధికారులు స్పందించి పైప్ లైన్ పనులు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజయ్యపేట పంచాయతీ పదవ వార్డు సభ్యుడు ఎం మహేష్ బాబు, పలువురు మత్స్యకారులు పాల్గొన్నారు

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు


ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ జోగారావు

ప్రజాశక్తి- నక్కపల్లి: ఆటోలో పరిమితికి మించి విద్యార్థులను ,ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ విభూషణరావు ఆటో డ్రైవర్లకు హెచ్చరించారు . నక్కపల్లి – ఉపమాక రహదారిపై శుక్రవారం ఆటోలను తనిఖీ చేశారు. ఆటోలో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించడం , ఆటో డ్రైవర్‌కు లైసెన్స్ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.వెంటనే నర్సీపట్నం ఆర్‌టిఒకు తెలియపరచడంతో ఆటో డ్రైవర్‌కు రూ.6200 అపరాధ రుసుము విధించారు.ఈ సందర్భంగా ఎస్ఐ విభూషణరావు మాట్లాడుతూ ముఖ్యంగా విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను పరిమితికి మించి ఎక్కిస్తున్న ఆటోలో స్కూలుకు పంపించవద్దని కోరారు. ఆటో డ్రైవర్లు లైసెన్సు కలిగి ఉన్నాడో లేదో గమనించాలన్నారు .పిల్లల చదువుతోపాటు భద్రత కూడా ఎంతో ముఖ్యమని గ్రహించాలన్నారు

పాయకరావుపేట : పట్టణంలోని ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు, ఓవర్‌లోడ్‌పై ఎస్ఐ జోగారావు ఎఎస్ఐ గోవిందు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ జోగారావు మాట్లాడుతూ ఆటోలో స్కూల్ పిల్లలను గానీ, ప్రజలను గానీ పరిమితికి మించి ఎక్కించి ప్రయాణం సాగిస్తే చర్యలు తప్పవన్నారు. ఆటోడ్రైవర్‌కు డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు వాహనాలకు అన్ని పత్రాలు విధిగా ఉండాలని సూచించారు. ఓవర్‌లోడ్‌తో వెళు తున్న, సరైన రికార్డులు లేని 13 ఆటోలకు జరిమానా విధించిననట్లు ఎస్ఐ జోగారావు వెల్లడించారు.

ఓటర్ల జాబితా తయారీలో నిర్లక్ష్యం వద్దు


బిఎల్ఒల సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్

ప్రజాశక్తి -కోటవురట్ల: బిఎల్ఒలు విధి నిర్వహణలో నిర్లక్ష్యధోరణి వీడి చిత్తశుద్ధితో పనిచేయాలని తాహసిల్దార్ జానకమ్మ సూచించారు. ఓటర్ల జాబితా తయారీ విధానంపై తప్పనిసరిగా ఇంటింటికి వెళ్లి నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. శు క్రవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో బిఎల్ఒలతో సమావేశంలో మాట్లాడుతూ ఓట్ల తొలగింపు, నమోదు, సవరణలు, చిరునామా, తదితర అంశాల పట్ల బిఎల్ఒలు సంపూర్ణ చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఓటర్ జాబితా తయారీ విషయం పట్ల ఎటువంటి అనుమానాలు అపోహలకు తావు లేకుండా, పార్టీల నుండి ప్రజల నుండి ఎటువంటి ఫిర్యాదులు అందకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. బూత్ స్థాయి అధికారులు ఎటువంటి నిర్లక్ష్యం వహించినా తీవ్ర పరిణామాలు తప్పవన్నారు. ఈ సందర్భంలో డిప్యూటీ తాహసిల్దార్ సోమశేఖర్ బిఎల్ఒలకు పలు సూచనలు సలహాలు అందజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ సూపరిండెంట్ చంద్రశేఖర్, పలువురు సూపర్వైజర్లు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టదా..?

లెక్కకు మించి విద్యార్థులతో యథేచ్ఛగా ప్రయాణం

ఆటోవాలాల నిర్లక్ష్యంపై అధికారుల ఉదాసీనత


ప్రయివేటు పాఠశాలకు ఆటోలో వచ్చిన పరిమితికి మించి విద్యార్థులు..

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలోని పలు ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల రాకపోకలకు ఏర్పాటు చేస్తున్న ఆటోలు పరిమితికి మించి విద్యార్థులను తీసుకురావడంతో విద్యార్థులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో ఆటోలో కనీసం 20 మంది వరకు విద్యార్థులు ఎక్కిస్తున్నారని, దీని వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని ఎన్నోసార్లు విద్యాసంస్థలకు తల్లిదండ్రులు మొరపెట్టుకున్న పట్టించుకోవటం లేదనే విమర్శలున్నాయి. ఈ క్షణాన ఏ ప్రమాదం ముంచుకుని వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు, మండల విద్యాశాఖ అధికారులు, రవాణా అధికారులు, స్థానిక పోలీసులు పట్టించుకుని, నిబంధనల ప్రకారం వాహనాల రాకపోకలు సాగేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.